ప్రతిక్రియ

శ్రీమతి గంగవరపు సీతాదేవి గారు

ఏకాంకనాటకము

ఇందువచ్చుపాత్రలు

రంగారావు:—కలెక్టరాఫీసు గుమాస్తా

మీనాక్షీ:—అతనిభార్య

శ్రీనివాసరావు:—9 యేండ్లబాలుడు } వారి పుత్రుడు

భానుమతి:—7 యేండ్లబాలిక } పుత్రికయు.

రంగము 1

స్థలము:—సౌధాంతర్భాగమందలి గది.

(రంగారావు కుర్చీలో కూర్చొని భార్యతో మాట్లాడుచుండును—పిల్లలు బొమ్మలపుస్తకము చూచుచుందురు.)

రంగారావు:—అయితే నీమాటే గెలుస్తుందంటావు.

మీనాక్షీ:—కాక—

రంగా:—కాక లేదు జ్వరమూ లేదు.

మీ:—అదుగో మళ్లీ యిటు తిప్పారా?

రం:—నీవన్నమాటేగా!

మీ:—నావుద్దేశ్యం "నామాట గెలవక మీమాట గెలుస్తుందా" అని.

రం:—మొత్తానికి నే చెప్పింది కాదనటం నేర్చుకున్నావు, ఇంకాయేం.

మీ:—మరి అందులో నాతప్పేముంది నిజం చెప్పానుగా!

రం:—నిజమేమిటంటావు?

మీ:—భానే తెలివిగలది.

రం:—శ్రీనంటే నీకంత కసిరెందుకు?

మీ:—కసేముంది యిద్దరు సమానులే నాకు.

రం:—పోనీ ఆమాటన్నా వొప్పుకోవేం?

మీ:—సమానులంటే తెలివియందు కాదు—ప్రేమయందు.

రం:—ప్రేమసంగతేమి వచ్చిందిప్పుడు.

మీ:—కసిసంగతేలా వచ్చింది?

రం:—నీవింకా కొన్నిరోజులకు "మహిళామండలి" అధ్యక్షురాలవరయ్యేదవు!

మీ:—అంటే?

రం:—అంత తెలివి వుందని.

మీ:—తెలివంతా మూటకట్టి మీజాతికే యిచ్చాడెట్లా బ్రహ్మదేవుడు?

రం:—అందులో సగం స్త్రీలకిగూడాను.

మీ:—యెట్లా?

రం:—సగం కాబట్టి

మీ:—సగంఅంటారు నిండాఅంటారు, అన్నిటికి సమర్థులే

రం:—సామర్థ్యంవుంటే నీవిట్లా యెదిరిస్తావా?

మీ:—ఉన్నమాటంటే వున్నవూరు అచ్చిరాదంటారు పెద్దలు.

రం:—పెద్దలమాటవింటే బాగుపడేపోదువు.

మీ:—యేం వినక?

రం:—నేను నీకు పెద్దనుకానా.

మీ:—అయితే!

రం:—నామాట వింటున్నావా?

మీ:—వినటంలేదా?

రం:—మరి శ్రీనే తెలివిగలవాడని ఒప్పుకో.

మీ:—అందుకనే కాబోలు తండ్రికి పెద్దకొడుకు మీద ఆపేక్షంటారు.

రం:—తల్లికి తుదివారిపైన అని గూడా.

మీ:—నాకుమట్టుకు భేదంలేదు.

రం:—నాకురద నేనా నీభావం?

మీ:—నేనన్నానా?

రం:—సరే రేపట్నుంచి భానుకు నీవే గుడ్డలు సొమ్ములు చేయించుకో.

మీ:—ఆతెలివితేటలు మాజాతికుంటే యిలా మాట్లాడతారా మగవారు!

రం:—ఒక అంగడిపెట్టి అమ్మరాదూ నీవు?

(అంగడిమాటవిని శ్రీనివాసరావు తండ్రి దగ్గరకు

వచ్చి)

శ్రీని:—నాన్నా కొనిపెట్టవు?

రం:—యేమిట్రా?

మీ:—తెలివి

శ్రీ:—అదికాదే పిప్పరమెంట్లే.

రం:—పిప్పరమెంట్లా సరేలే.

(పిప్పరమెంట్ల మాటవిని భానుమతివచ్చి)

భా:—నాకో నాన్నా.

రం:—మీ అమ్మనడుగు.

రం:—యేమే అమ్మా నాకేమో పిప్పమెంట్లే

మీ:—అన్నీ నీకే కొనిపెడతాన్లే. మా అమ్మకదూ!

(అంటూ యెత్తుకొని ముద్దుపెట్టుకొనును. అది చూచి)

శ్రీ:—మాఅమ్మ. మీఅమ్మకాదు. పో, దిగు.

భా:—మాఅమ్మ. యేమే అమ్మా, కదూ?

(శ్రీను భానుకాలుపట్టి గుంజును. భాను శ్రీను ను గిల్లును. ఇద్దరూ యేడ్తురు.)

రం:—వెధవగోల. యింట్లో ఒక్క నిమిషం వుండ నివ్వరు (లేచును తెరజారును)

రంగము 2

సాయం సమయము

స్థలము—సౌధబహిర్భాగము

(భాను శ్రీను ఆడుకొనుచుందురు.)

శ్రీ:—యెందుకే అమ్మ మన న్నూరికే బాదుతుంది?

భా:—తో చక:—

శ్రీ:—నిజంగా అంతేనే. లేకుంటే నిన్న నేనూరికే కూచుంటే తన్నిందే!

భా:—పిలిస్తే రాలేదని.

శ్రీ:—నాకు వినబడితేగా మరి.

భా:—అందుకే నేమోకాని నన్నేమో పూరికనే కొట్టింది. నాన్నతో చెప్తానన్నా, మల్లీకొట్టింది.

శ్రీ:—అందుకేనా వంటింట్లో యేడ్చింది?

భా:—ఔను గాని నిన్నేమో నాన్న అన్నమను తిత్తిం దెందుకురా?

శ్రీ:—పులుసులో వుప్పెక్కువైందని.

భా:—వుప్పెక్కువైతే కొట్టకం దేనికే, తియ్యరాదు?

శ్రీ:—కలిసిపోతుందిగా, మరి తియ్యటం యెట్లా?

భా:—అట్లాగైతే పులుసులో వుప్పెక్కువైతే అమ్మకు తిత్తినన్న మాట.

శ్రీ:—యెక్కిత్తే తంతుందేవ్!

భా:—అప్పుడోయి-మరెప్పుడమ్మ-అప్పుడు మనం బాబయ్యగారింటికి వెళ్లేం చూచా; అప్పుడు తన్నాడ్రా.

శ్రీ:—......

భా:—యేరా, కాదూ?

శ్రీ:—వుండవే.

భా:—యేమిట్రా అట్లా వున్నావ్?

శ్రీ:—నేనొకటి చెప్తాగాని అమ్మతో చెప్పవుగద?

భా:—తన్నా.

శ్రీ:—మనం రాత్రికి పులుసులో వుప్పేద్దాం. యెక్కువవుతుంది. చీవాట్లు తగుల్తాయి. మనన్ని కొట్టింది కదూ?

భా:—అన్నింట్లో వేద్దాం నాన్నకు యింకాకోపం వస్తుంది?

శ్రీ:—ఔ నేవ్!

భాను:—యెప్పుడేద్దాం?

శ్రీ:—రాత్రికే.

భా:—రాత్రికే!

శ్రీ:—రాత్రి కమ్మ పనాతుంది.

భా:—నాకేమో నవ్వువస్తుంది.

శ్రీ:—అమ్మ నిన్ను కొడుతుంది.

భా:—అమ్మ నిన్నే కొడుతుంది.

శ్రీ:—అన్న అన్నమాటంటుంది.

భా:—అన్న.

శ్రీ:—నాకేమో లేదుగా!

(తెరపడును.)

రంగము 3

స్థలము—భోజనాలసావడి.

రాత్రి భోజనసమయము. చెరవసరుచుకొని నేలపరుండియున్న మీనాక్షి విసుగుకొనుచుండును.

దగ్గిర వేసియున్న వీధితలుపు చప్పుడు కాగా మీనాక్షి "యెవరు?" అని లోనుండి.

"నేనే మీనా, వంట పూర్తయిందా?"

మీ—యేమిటండీ యివాళ ఆలస్యంగా వచ్చారింటికి? కాస్త పెందలకడే రాగూడదూ?

రం—: "నా మొగుడు రాని స్త్రీగా" (అంటూ ప్రవేశించును).

మీ—ఆ దేమిటండోయి.

రం—మాపై అధికారి రానిచ్చాడు కాదు.

మీ—అధికారి మీ—

రం—అవంతా నీ కెందుకు. అన్నం పెడ్తా ఆకలౌతున్నది. పిల్లలన్నం తిన్నారా?

మీ—చెవులు పగిలిపొయ్యేటట్లిప్పటిదాకా గోల చేసి పడుకున్నారు. అన్నానికి రమ్మంటే రాలేదు.

రం—నీవు బాదావు.

మీ—ముద్దుపెట్టుకోమంటారా గోలచేస్తుంటే మరి.

రం—నిన్ను మా అత్తగారిట్లాగే పెంచినారా?

మీ—మా అమ్మ అయితేనా పిల్లలు చేసే గోలకు?

రం—చిన్నపిల్లల ఆటలు నీ చెవులకు గోలగా వుంటుంది.

మీ—ఆటలేమిటండీ పూరికే నడిబజారులో పొర్లాడుతూ శివమెత్తినట్లు అరుస్తుంటేను.

రం—నీళ్లన్నా పోశావా?

మీ—పిలిస్తె వస్తేగా!

రం—పిల్లల్ని పెంచటం నీకు చేతకాకే రాకెం చేస్తారు? మగవాణ్ని చచ్చి చెడి యిప్పటికి ఆఫీసునుంచి ఇంటికివస్తె యీగోల. పిల్లల్ని పెంచటంగూడా తెలియనివారికట స్వతంత్రం కావాలట—సరే ఆలాంటి కట్టా తగలేయి—దొడ్లో యేన్నీళ్లున్నయ్యా?

మీ—............

రం—యేం వుద్యోగం యేడుస్తున్నా? వాళ్ల కర్మం. యీ చలిలో చన్నీళ్లు......(నిష్క్రమించును)

మీ—అడ్డమైన చాకిరీ చేస్తూన్నా చీవాట్లుగూడా నాపైన (అని సనుగుతూ వడ్డించును)

(రంగారావు బిడ్డలను తుడుస్తూ తీసుకొవచ్చి పీటపైన కూర్చుండబెట్టును.

రం—(భుజిస్తూ) శ్రీనూ మీరు సాయంత్రం బజారులో గోలచేసిం దెందుకురా. నేనేమని చెప్పి వెళ్లాను?

శ్రీ—మే మేం గోలచేశాం. ఏమే, మనం గోల చేశామటే?

రం—మరెందుకు అమ్మ కొట్టింది. యేమే భానూ నిజం చెప్పు?

భా—మరేమో. మేమిద్దరం మేమో దసరా పాటలు పాడుకుంటుంటే నే గోలచేస్తున్నామనేమో అమ్మ కొట్టింది.

రం—యేమిటే కూరలో వుప్పెక్కువైంది?

మీ—కొద్దిగానే వేశానే!

రం—కొద్ది వుప్పు.........

మీ—అయినా యీ వెధవ లోకటితో చనిస్తారా?

రం—నీ మొఖం. వాళ్లను తిట్టమంటే వుండే సంతోషం వంటచేయటంలో వుండగూడదూ?

మీ—వాళ్లను తిట్టడం నాకు సంతోషమా?

రం—పులుసు.

మీ—ఆ!

(భానుమతి శ్రీనివాసరావును చూచి నవ్వును. శ్రీనివాసరావు గుడ్లురుమును)

రం—(కొద్దిగా పులుసు రుచిచూచి ఆవలికి త్రోసివేసి) యేంరోగం వచ్చిం దివాళ అన్నింట్లో వుప్పెక్కువేసే.

మీ—ఎక్కువ?

రం—ఎక్కువ! కషాయం మేలు. వళ్లుబలిసి కొట్టుకుంటున్నావు. ఇరవైయేండ్లు పైబడ్డవి యింకా వంట నేర్చుకునే దెప్పుడు?

మీ—ఇవాళేదో.

రం—నోరు ముయ్యి.

(భాను శ్రీనును చూచి చిరునవ్వు నవ్వును. శ్రీను మందహాసము చేయును.)

మీ—అది కాదండీ.

రం—పైన యెదురు మాట్లాడవస్తున్నావ్! మూతిపండ్లు రాలకొట్టేను జాగ్రత్త.

(మీనాక్షి కండ్ల వెంబడి నీరు కార్చుచుండును)

రం—మజ్జిగ

(మీనాక్షి కన్నీరు కన్ను తుడుచుకొనుచూ మజ్జిగ వడ్డించును. రంగారావు రుచిచూచి వుమ్మేసి కోపముతో) నీవు రేపుదయం బండెక్కి పుట్టింటికి దయచేసి మీ అమ్మవడిగి పిల్లల్ని పెంచడం వంటచేయడం నేర్చుకొని మరీ యింటి ముఖం చూడు. కూర పులుసు మజ్జిగ యిల్లువాకిలి అమ్మ అంతా వుప్పుమయం.

(భానుమతి యేడ్వ ప్రారంభించును. శ్రీనివాసుడు గుడ్లురుమును. రంగారావు విది చూచును.)

రం—భానూ యెందుకే అలా యేడుస్తున్నావు?

భా—..................

రం—యేమిట్రా శ్రీను అలా చూస్తున్నావు. యేమిటే భానూ?

భా—అమ్మ యేడుస్తుంది.

రం—యేడుస్తుంది అన్నిటికీ సాహసురాలే. రెండు బాదితేకాని పూర్తికాదు.

భా—(బిగ్గరగా యేడ్చుచూ) అమ్మకాదు వుప్పేసింది అన్నయ్య.

రం—యేరా.

శ్రీ—అదే, నేకాదు.

రం—నిజంచెప్పవే భాను.

భా—పులుసులో వుప్పెక్కువవేస్తే నేనెందుకు నాన్నకు కోపంవస్తుంది. అమ్మకు చివాట్లు వస్తవి వేద్దామన్నా డన్నయ్య. సరే. చాలావాట్లో వేద్దాం చాలా వస్తవన్నా. పరేనన్నాడు. నేనేమో అమ్మ భావికాడికెళ్లింది చూసా. అప్పుడు వాకిట్లోనుంచున్నా చూస్తూ. వాడు వేశాడు. (మరీ బిగ్గరగా యేడుస్తుంది)

రం—భలే పనిచేశావ్ శ్రీనూ (చేతులు కడుగుకొనును)

మీ—అదేంటి చేయి కడుగుతున్నారు. కాస్త వూరగాయితో తింటుండండి పాయమ్మ త్తవడిగి మజ్జిగ పోయించుకొస్తా. (రెండడుగులు ముందు వేయును)

[శ్రీను తనవైపునకు వచ్చుచున్న మీనాక్షిని గాంచి "అమ్మ కొడుతుందేవ్" అంటూ బయటికి పరుగెత్తును. భానుమతి భయపడి అన్న ననుసరించును.]

రం—కాదులే చెప్తావుండు.

(అని చేతులు కడుగుకొని లేచి మీనాక్షి రెండు చేతులు పట్టుకొని)

ఎవరు తెలివిగలవారో తెలిసినదా? మీనా, యింత చేసినది శ్రీనా, భానా?

(మీనాక్షి సిగ్గుచే తలవంచుకొని మారాడదు)

రం—(మీను గడ్డముపట్టుకొని తలయెత్తుచూ) మీనా యిప్పటికైనా వొప్పుకుంటావా తెలివి తేటలు మా జాతివేనని.

మీ—ఔను కాబట్టే భాను సలహా, సహాయము కూడా కావలసివచ్చింది. అది లేకపోతే గాడిద యింకా యేడుస్తుండేవాడు.

రం—సరే రాజీ. మాజాతి కెంత తెలివితేటలున్నా మీజాతి దయలేకపోతే సానపట్టని వజ్రమే.

మీ—ఆ?.........సరే లెండి, చేయివదలండి, పాయమ్మ త్తవడిగి—

రం—నిజానిజములెరుగక ముందే నిన్ను దూషించినందుకు గాను మళ్లీ నీకు శ్రమనివ్వకుండా హోటలునుంచి భోజనం తెప్పిస్తాను. మరి నీ వోడిపోయినందుకో.

మీ—నే వోడానా! రాజీకాదు?

రం—ఔను రాజీ—కాని ఖర్చులకు నీమీద డిక్రీ అయింది.

భా—ఖర్చులేమిటి డిక్రీయేమిటి?

రం—నీతో యీవిషయమై వాదించలేక నా నోరు నొప్పెత్తింది కావున (అంటూ భానుమతిని దగ్గరకు లాగుకొనును)

భా—ఆ! యెప్పుడూ మీకు సరసాలే........ వదలండి పది నిమిషాల్లో వంటచేస్తాను, కరువు కాలంలో డబ్బు దండుగ దేనికి?

(యవనికాపతనము)